# తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

## సమస్యను పరిష్కరించాలని డిమాండ్



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

వీర్నపల్లి, ఫిబ్రవరి 19: తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ మహిళలు బుధవారం రోడ్డెక్కారు. నెలరోజులుగా తమకు సరిపడా తాగునీరు రావడం లేదని రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోని ఎల్లమ్మ గుడి ఏరియా వాసులు స్థానిక స్తూపం వద్ద ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేశారు. డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో పైపులైన్ ధ్వంసమై నెలలు గడుస్తున్నా.. ఇంతవరకు రిపేర్ చేయలేదని మండిపడ్డారు. వారానికో సారి ట్యాంకర్లతో అరకొరగా నీటిని సరఫరా చేస్తున్నారని.. అవి ఎటూ సరిపోవడంలేదని ఆరోపించారు. ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న నీటిలో చెత్త, నాచు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# కోళ్ల మృతి కలకలం

## లింగంపేటలో మూడు రోజుల వ్యవధిలోనే 2500 మృత్యువాత



మృతి చెందిన కోళ్లు

చందుర్తి,ఫిబ్రవరి 19: అంతుచిక్కని వ్యాధితో కుప్పలు తెప్పలుగా కోళ్లు మృతి చెందడం చందుర్తి మండలం లింగంపేటలో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన రమేశ్‌రావు పద్నాలుగేళ్లుగా పౌల్ట్రీ వ్యాపారం చేస్తున్నాడు. కోళ్ల ఫారాలు నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. గడిచిన మూడు రోజుల వ్యవధిలో మొత్తం 2500 కోళ్లు మృత్యువాత చెందడంతో ఆవేదన చెందుతున్నాడు. ₹4లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోతున్నాడు. అయితే పలు గ్రామాల్లోని కోళ్ల ఫామ్‌లలో కూడా కోళ్లు మృతి చనిపోతుండగా, ఇది అంతుచిక్కని వ్యాధా.. లేక బర్డ్ ఫ్లూనా..? అన్న అనుమానం ప్రజల్లో వ్యక్తమవుతున్నది.

### తాపకు బిందెడు పోస్తున్నది



ఎండిపోయిన పొలంలో రైతు ఎల్లం

నాకు రాజన్నపేట జంగంబండ కింద ఐదెకరాల పొలమున్నది. ఇప్పటివరకు లక్ష రూపాయలకు పైనే పెట్టుబడి పెట్టిన. పంట మంచిగ పండుతదనుకుంటే బోర్లు ఎత్తేసినయ్. వారం కింద కాల్వ నీళ్లు వస్తయంటే సంబురమనించింది. అప్పటికీ మూడెకరాల పొలం ఎండింది. ఉన్నదాన్ని కాపాడుకుందామని నీళ్లల మోటర్ తెచ్చిన. ఆ నీళ్లగూడ మోటర్ మునిగేటన్ని వస్తలెవ్వు. తాపకు బిందెడు పోస్తున్నది. గడిగడికి మోటర్ బంజేసుకుంట పొలం పారిచుకుంటున్నం. ఇప్పటికే రెండుసార్లు మోటరు కాలిపోయింది. కాలిపోయినప్పుడల్లా ₹3వేలు అయితున్నయ్. మా బాధలు ఎవలకు చెప్పాలో అర్థమైతలేదు. ఇవారకు మాకు రైతుబంధు రాలేదు. ₹1.82లక్షల బ్యాంకుల బాకీ ఉంటే.. ఆ రుణమాఫీ కాలేదు. **- ద్యాప ఎల్లం, రైతు, రాజన్నపేట (ఎల్లారెడ్డిపేట)**

# కాల్వల మోటర్లు కాలిపోతున్నయ్



కాలిపోయిన మోటర్‌ను చూపుతున్న రైతు

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19: ఎల్లరెడ్డిపేట మండల రైతులు ఆగమవుతున్నారు. సాగునీరు లేక పంటలను కాపాడుకునేందుకు తండ్లాడుతున్నారు. ఈ క్రమంలో రోడ్డెక్కి నిరసనలు కూడా తెలిపారు. దీంతో వారం క్రితం అధికారులు హడావిడి చేసి మల్కపేట రిజర్వాయర్ నుంచి నీటిని కాలువలోకి వదలడంతో సంతోషపడ్డారు. సమీప ప్రాంత రైతులు ₹15వేల నుంచి ₹20వేలు ఖర్చు పెట్టి కాల్వలో మోటర్లు వేసి పొలాలకు పారించే ప్రయత్నం చేశారు. అయితే కాలువలో అనుకున్న స్థాయిలో నీళ్లు రాక పొలాలకు నీళ్లు పెట్టేందుకు రాత్రిల్లూ జాగారం చేస్తున్నారు. మోటర్లు కూడా మునిగే స్థాయిలో నీళ్లు రాక అవి కాలిపోతున్నాయని ఆవేదన చెందుతున్నారు. మూడు రోజుల నుంచి ఇదే పరిస్థితి ఉందని వాపోతున్నారు.



గంగాధర: చుక్కనీరు లేని వెంకంపల్లి ఎగ్రేని కుంట



పిచ్చిమొక్కలతో ఎండిపోయి కనిపిస్తున్న మల్లాపూర్ చెరువులోకి నీరు వచ్చే కెనాల్

### మూడు గ్రామాలు.. వందలాది ఎకరాలు

గంగాధర, ఫిబ్రవరి 19: పదేండ్లలో సాగునీటి గోస లేకుండా రైతులు సంబురంగా పంటలు సాగు చేశారు. కానీ, ఈ యేడాది సాగునీటి ప్రణాళిక లేక అష్టకష్టాలు పడుతున్నారు. నారాయణపూర్ రిజర్వాయర్‌లో నిండుగా నీరున్నది. కానీ, అధికారుల పర్యవేక్షణ లేక ప్రయోజనం లేకుండా పోతున్నది. కొడిమ్యాల కొండాపూర్ చెరువు నిండుగా ఉన్నా కెనాల్ ద్వారా మండలంలోని మల్లాపూర్ ఊర చెరువు, వెంకంపల్లి ఎగ్రేని కుంటలకు నీళ్లు ఇవ్వడం లేదు. దీంతో మూడు గ్రామాల పరిధిలో వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయే దుస్థితి వచ్చింది. మరో పది రోజుల్లో సాగునీరు విడుదల చేయకుంటే పొలాలు పూర్తిగా ఎండిపోయే ప్రమాదముండగా, రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ పంటలకు నీళ్లిచ్చి కాపాడాలని వేడుకుంటున్నారు.

# కలెక్టర్ మేడం.. మా పంటల్ని కాపాడండి

- మొగ్దుంపూర్ సహా ఐదు గ్రామాల రైతుల మొర
- నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీళ్లు వదలాలని విజ్ఞప్తి



కరీంనగర్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చిన అనంతరం కలెక్టరేట్ ఎదుట రైతులు

తమ గ్రామాలకు నారాయణపూర్ పైప్‌లైన్ ద్వారా తక్షణమే నీటిని విడుదల చేయించాలని మొగ్దుంపూర్, మందులపల్లి, నల్లగుంటపల్లి, చేగుర్తి, ఇరుకుల్ల గ్రామాల రైతులు రెండ్రోజుల కింద కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసి గోడును వెల్లబోసుకున్నారు. మంత్రి స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్‌ను ఫోన్‌లో ఆదేశించారు. అయినా అధికారులు చలించక పోవడంతో బుధవారం రైతులు నేరుగా కలెక్టర్‌ను కలిసి తమ పంటలను రక్షించాలని వేడుకున్నారు. ఇప్పటికే అనేక ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, తక్షణమే నారాయణ పూర్ రిజర్వాయర్‌కు వెళ్లే పైప్‌లైన్ ద్వారా నీటిని విడుదల చేయకుంటే వందల ఎకరాల్లో నష్టపోయే ప్రమాదం ఉందని వాపోయారు. ఇరుకుళ్ల వాగు ద్వారా నీరు వస్తే తమ బావులు, బోర్లలో నీటి మట్టం పెరుగుతుందని, సాగు నీటితోపాటు తాగునీటి కష్టాలు కూడా తీరుతాయన్నారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు రైతులు చెప్పారు. అయితే ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి వచ్చే ఈ పైప్‌లైన్ ద్వారా నీటిని విడుదల చేయడం వల్ల రామడుగు, కొత్తపల్లి, కరీంనగర్ రూరల్ మండలాల్లోని వందలాది ఎకరాలకు నీరందే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

### బోరు వేసిన.. చుక్కనీరు రాలె



నక్కవాగు పరిసర గ్రామమైన గన్నెవానిపల్లె మాది. నాకున్న ఐదెకరాల్లో వరి వేసిన. పది రోజుల నుంచి బోరుబావులు ఎత్తేసినయి. పంటలు వాడిపోతున్నయి. వేసిన పంటను కాపాడడం కోసం ₹2.50లక్షల ఖర్చుపెట్టి 600ఫీట్ల బోరు వేసిన. అయినా చుక్క నీరు రాలె. నక్కవాగులోకి నీరు విడుదల చేయకుంటే అన్నివిధాలా నష్టపోతం.

**- గన్నె నర్సయ్య, గన్నెవానిపల్లె (ముస్తాబాద్)**



మామిండ్లవారిపల్లెలో కొత్త బోరు వేస్తున్న రైతులు

# సాగునీటి కోసం 'భగీరథ' యత్నం



మామిండ్లవారిపల్లెలో నెర్రెలు బారిన పొలం

ముస్తాబాద్, ఫిబ్రవరి 19: బీఆర్‌ఎస్ పాలనలో మల్లన్నసాగర్ ప్రాజెక్టు కాలువల ద్వారా ముస్తాబాద్ మండల కేంద్రంలోని పెద్ద చెరువుకు నీళ్లు వచ్చేవి. ఆ తర్వాత ఎల్లమ్మ వాగుకు, అక్కడి నుంచి నక్కవాగుకు చేరేవి. దాంతో రైతులకు సాగునీటి కష్టాలు ఉండేవి కాదు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సాగునీరు రాకపోవడంతో ముస్తాబాద్ మండల రైతులు అరిగోసపడుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు, మూడు రోజుల్లో ఎల్లమ్మ వాగు, నక్క వాగులోకి నీరు విడుదల చేయకుంటే పోతుగల్, గన్నెవానిపల్లె, నర్సింహులతండా, మామిండ్లవారిపల్లె, నిమ్మలవారిపల్లె గ్రామాల్లో పంటలు ఎండిపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిబ్రవరి రెండోవారంలోనే ఎండలు దంచికొట్టడంతో పంటపొలాలు ఎండుతున్నాయని, పొట్ట దశకు వచ్చిన పంటలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో అన్నదాతలు సాగునీటి కోసం భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి బోర్లు వేస్తున్నా.. చుక్క నీరు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాగునీటిని విడుదల చేయాలని కోరుతున్నారు.



### ఎల్లమ్మవాగులోకి నీటిని వదలాలి

మాది నరసింహుల తండా. నాకున్న ఆరెకరాల్లో వరి పంట వేసినం. వారం నుంచి బోరుబావుల్లో ఊట తక్కువైంది. పొట్ట దశకు వచ్చిన పొలం నెర్రెలు బారుతున్నది. ముస్తాబాద్ చెరువు నుంచి ఎల్లమ్మవాగు, నక్క వాగులోకి నీటిని విడుదల చేయాలి. రైతులు నష్టపోకుండా చూడాలి

**- రమావత్ శ్రీనివాస్‌నాయక్, నర్సింహులతండా**

### కేసీఆర్ సార్ పాలనే బాగుండేది



మాకు ఐదెకరాల భూమి ఉన్నది. అప్పుచేసి.. పెట్టుబడి పెట్టి వరి పంట వేసిన.ం బోరుబావిలో నీరు పూర్తిగా తగ్గడంతో పంట ఎండిపోతున్నది. అధికారులు, నాయకులు వాగులో నీళ్లస్తయని చెబితే పెట్టుబడి పెట్టాం. నీళ్లు ఇంతలోనే అడుగంటుతుందని అనుకోలేదు. అప్పులు చేసిన వేసిన పంటలు ఎండిపోతే పెట్టుబడి కూడా మీదపడ్డది. కేసీఆర్ సారు పాలనే మంచిగున్నది.

**- బలవంతపురం భూలక్ష్మి, నర్సింహులతండా**

- డీ-89 కాలువ చివరి ఆయకట్టులో ఎండిపోతున్న పంటలు
- ప్రశ్నార్థకంగా వందలాది ఎకరాలు
- ఆందోళనలో కరీంనగర్ రూరల్ మండల రైతులు

# రైతన్న కన్నీటి గోస

## వేసవికి ముందే తీవ్రరూపం దాల్చుతున్న సాగునీటి కష్టాలు



**సాగునీటి కొరత తీవ్రమవుతున్నది. వేసవికి ముందే చేను, చెలక తడారిపోతున్నది. ఇప్పటికే కరీంనగర్ రూరల్, గంగాధర, తిమ్మాపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో చివరి ఆయకట్టుకు నీరందక పంటలు ఎండిపోతుండగా, తాజాగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పరిధిలోని డీ-89 కాలువ చివరి భూములకు కటకట ఏర్పడింది. మొగ్దుంపూర్, మందులపల్లి, నల్లగుంటపల్లి, చేగుర్తి, ఇరుకుల్లలో చేతికందే దశలో పంటలు వల్లిపోతుండగా, రైతులు తల్లడిల్లుతున్నారు. రెండ్రోజుల క్రితం కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసిన విన్నవించిన కర్షకులు, బుధవారం కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి తక్షణమే నీటిని విడుదల చేయకుంటే సుమారు వెయ్యి ఎకరాల్లో పంట ఎండిపోయే ప్రమాదం ఉందని వాపోయారు.**

కరీంనగర్, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ) : సాగునీటి కటకట రోజు రోజుకూ తీవ్ర రూపం దాల్చుతున్నది. పదేళ్ల పాటు ఏ రంది లేకుండా ఏటా రెండు పంటలు పండించిన రైతులు, గత రెండు సీజన్ల నుంచి అరిగోస పడాల్సి వస్తున్నది. ప్రాజెక్టు ద్వారా నీళ్లు వస్తాయని ప్రభుత్వం, అధికారులు చేసిన ప్రకటనను నమ్మి వరి నాట్లు వేసిన అన్నదాతలు ఇప్పుడు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికే కరీంనగర్ రూరల్, గంగాధర, తిమ్మాపూర్ మండలాల్లో పలు గ్రామాల్లో చివరి ఆయకట్టుకు నీళ్లందక పంటలు ఎండిపోతుండగా, పశువులకు వదిలేస్తున్నారు. ఇప్పుడు ఎస్సారెస్పీ పరిధిలోని డీ-89 కాలువ చివరి ఆయకట్టు అయిన కరీంనగర్ రూరల్ మండలంలోని మొగ్దుంపూర్, మందులపల్లి, నల్లగుంటపల్లి, చేగుర్తి, ఇరుకుల్ల గ్రామాలకు నీరందక తండ్లాడుతున్నారు. గడిచిన పదేళ్లలో సాగు నీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులు ఏటా రెండు పంటలు పండించుకున్నారు. ఇరుకుల్ల వాగు ఒడ్డుకు ఉండే ఈ గ్రామాలకు గతంలో గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి నీళ్లు వచ్చేవి. ఎల్లంపల్లి నుంచి నారాయణపూర్ రిజర్వాయర్‌కు వెళ్లే పైప్‌లైన్‌కు సర్వారెడ్డిపల్లి వద్ద ఒక గేట్ వాల్వు ఉంది. ఇక్కడి నుంచి ప్రతి సీజన్‌లో నీటిని విడుదల చేసే వారు. అక్కడి నుంచి రామడుగు మండలం గుండి చెరువుకు నీళ్లు వెళ్లేవి. అక్కడి నుంచి కాట్నపల్లి, రేవెల్లి గ్రామాల మీదుగా గుండి వాగు నుంచి ప్రవహిస్తూ ఇరుకుల్ల వాగులోకి నీళ్లు వచ్చేవి. ఈ నీళ్లు ఇరుకుల్ల, నల్లగుంటపల్లి, చేగుర్తి, మందులపల్లి, మొగ్దుంపూర్ మీదుగా నారాయణరెడ్డిపల్లి వరకు ప్రవహిస్తే ఈ ప్రాంతంలోని బావులు, బోర్లలో పుష్కలమైన భూగర్భ జలాలు ఊరి పంటలకు సరిపడా అందేవి. పదేళ్లుగా ఇదే పద్ధతిలో నీళ్లు వస్తున్నాయని, ఇపుడు సర్వారెడ్డిపల్లి వద్ద గేట్ వాల్వును ఓపెన్ చేయక పోవడంతో నీళ్లు రాక అటు గుండి వాగు, ఇరుకుల్ల వాగులు వట్టిపోయాయని రైతులు చెబుతున్నారు. ఈ కారణంగా భూగర్భ జలాలు ఇంకి పోయి మొగ్దుంపూర్‌లో 350, నల్లగుంటపల్లిలో 60, మందులపల్లిలో 25, చేగుర్తిలో 60, ఇరుకుల్లలో 150 ఎకరాల్లో పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఇక డీ-89 ద్వారా కూడా ఈ గ్రామాలకు సాగు నీరు రావడం లేదు. గతేడాది డిసెంబర్ 25 నుంచి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ కాకతీయ కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఆన్ ఆఫ్ పద్ధతిలో ఇప్పటికే నాలుగు సార్లు విడుదల చేశారు. కానీ ఈ ప్రాంతానికి మొదటి విడతలో నాలుగు రోజులు, రెండో విడతలో మూడు రోజుల పాటు నీళ్లు వచ్చాయని, మిగతా రెండు విడతల్లో ఒక్క చుక్క నీళ్లు రాలేదని రైతులు వాపోతున్నారు. ఈ కాలువ కింద ఒక్క మొగ్దుంపూర్ గ్రామంలోనే 300 ఎకరాల వరకు సాగవుతున్నదని చెబుతున్నారు. సాగునీరు అందని కారణంగా పంటలు ఎండిపోతుంటే పశువులకు వదిలేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు నీళ్లు రావని చెబితే తాము పంటలు సాగు చేసే వారము కాదని, ఇస్తామని చెప్పి ప్రభుత్వం, అధికారులు తమను మోసం చేశారని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### నీళ్లిస్తమంటేనే పంట లేసినం



యాసంగి సాగుకు ముందు ప్రాజెక్టుల నీళ్లున్నయి. పంటలకు ఇస్తమని ప్రభుత్వం అంటేనే పంటలు ఏసుకున్నం. లక్షలకు లక్షలు పెట్టువడి అయ్యింది. రైతులు ఎట్ల బత్కాలే. పెట్టువళ్ల మీద పడితే ఉరేసుకునుడు తప్పా ఇంకో దారి లేదు. యాసంగిల నీటి ఎద్దడి ఉంటదని అధికారులు చెప్పితే పంటలు ఏసుకునేటోళ్లంగాదు. అపుడు ఎందుకు చెప్పింండ్రు.. ఇప్పుడు ఎందుకిస్త లేరు. నీళ్లు లేవని చెప్పితే మేం పంటలు ఏసుకునెటోళ్లంగాదు. అధికారులు పట్టించుకుంటరో, ప్రభుత్వం పట్టించుకుంటదో, మా పంటలు కాపాడాలే. లేకపోతే రైతులందరం రోడ్డెక్కాల్సి వస్తది.


**- కాశవేణి భూమయ్య యాదవ్, రైతు**

### పదేండ్లల్ల ఇసొంటి ఎద్దడి చూడలే



పదేండ్లల్ల ఇసొంటి నీటి ఎద్దడి చూడలే. నీళ్లు లేకుంటే తిప్పలగానీ ఉన్నంక ఎందుకిత్తలేరు. ఆఖరి ఆయకట్టు రైతులు గంగల వోనియ్యా. ఒక్కొక్కలు లక్షల పెట్టువడి వెట్టి నాట్లేసిన్రు. నీళ్లు రాకుంటే పంటలు మొత్తం పాడైపోతయి. రైతులు తిండి తిప్పలు మాని నీళ్ల కోసం అరిగోస వడుతున్నరు. డీ-89 కాలువ కింది మొకాన చుక్క నీరత్తలేదు. నీళ్లు ఎక్కువ ఇస్తేనే మాకు వస్తయి. ఎడ్డెమెడ్డెం ఇడ్తే అత్తయా..

**- దాడి నర్సయ్య, రైతు**



అడుగంటిన నల్లగుంటపల్లి రక్షిత మంచి నీటి బావి

### వాగొడ్డు మొత్తం ఎండుతంది



ఇరుకుల్లకాన్నుంచి మొగ్దుంపూర్‌దాక వాగొడ్డుకు ఉన్న పంటలన్నీ ఎండిపోతన్నయి. నారాయణపూర్ చెరువు పైప్‌లైన్ కెళ్లి నీళ్లిస్తేనే మాకు ఆధారం ఉంటది. అది కూడా ఎంటనే ఇస్తేనే ఎండిపోయే పంటలను కాపాడుకోవచ్చు. నిరుటిదాకా ఇచ్చి ఇపుడు ఇవ్వకుంటే ఎట్ల. నీళ్లిస్తమని చెప్పితెనే మేం పంటలు ఏసుకున్నం. ఇపుడు నీళ్లు రాకుంటే పట్టించుకునెటోళ్లు లేరు. లక్షలకు లక్షలు పెట్టువడి పెట్టి పంటలేసినం. కండ్ల ముందటనే ఎండి పోతుంటే తట్టుకోలేక పోతున్నం. నీళ్లు ఇయ్యకుంటే ప్రత్యక్ష పోరాటం చెయ్యక తప్పది.

**- కూకట్ల తిరుపతి, రైతు**



చుక్క నీరు లేని గుండి ఇరుకుల్ల వాగు

### కలెక్టరే మమ్మల్ని ఆదుకోవాలే..



అన్ని పార్టీల నాయకులను కలిసినం. మా గోస అందరికి చెప్పుకున్నం. ఇప్పిస్తం.. ఇప్పిమని చెప్పున్నరు. ఇపుడపుడు అంటున్నరు. కానీ ఒక్కలు సుతం పట్టింపు లేకుంట ఉన్నరు. కలెక్టర్‌తోనే మాకు న్యాయం జరుగుతదని ఇక్కడికి వచ్చినం. మా పంటలు ఎండి పోతున్నయి. రెండెకరాలు నాటేసిన రైతులకు ఎకరం పొలం ఎండిపోయింది. బోర్లు పోస్తలేవు.. బాయిల్ల నీళ్లు లేవు.. కాలువల నీళ్లు అస్తలేవు. పంటలు ఎట్ల పండాలే. కలెక్టర్ మేడమే మా మీద దయ తల్చాలే.. నారాయణపూర్ నుంచి నీళ్లియ్యాలే.. **- కందుల రమేశ్, రైతు**

# 'సదరం'లో అక్రమాలు నిజమే

- పది రోజుల క్రితమే దందాను వెలుగులోకి తెచ్చిన 'నమస్తే'
- ప్రత్యేకంగా విచారణ జరిపిన కమిటీ
- తాజాగా ఇద్దరు సిబ్బంది తొలగింపు
- పీఆర్‌వోల వ్యవస్థ రద్దు
- 'నమస్తే' కథనం ఎఫెక్ట్

**కరీంనగర్ జనరల్ హాస్పిటల్‌లో 'సదరం' అక్రమాల నిగ్గు తేలింది. వారం రోజుల పాటు విచారణ జరిపిన అధికారులు, బాధ్యులుగా తేలిన ఇద్దరు ఏజిల్ సిబ్బందిపై వేటు వేయడం కలకలం రేపింది. దివ్యాంగ సర్టిఫికెట్ల కోసం వచ్చే అమాయకుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తూ, ఏమార్చుతున్న తీరును 'నమస్తే తెలంగాణ' ఈ నెల 11న వెలుగులోకి తెచ్చింది. శిబిరంలో జరుగుతున్న అక్రమాలను, బ్రోకర్లుగా మారిన సిబ్బంది తీరును బయటపెట్టింది. దీనిపై సూపరింటెండెంట్ డాక్టర్ గుండా వీరారెడ్డి నలుగురు అధికారులతో విచారణ చేపట్టారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడమే కాకుండా, దవాఖానలో అజమాయిషీ చెలాయిస్తున్న పీఆర్‌వోలను పూర్తిగా తొలగించడం సంచలనంగా మారింది.**

కరీంనగర్ విద్యానగర్, ఫిబ్రవరి 19 : కరీంనగర్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్)లో నిర్వహిస్తున్న సదరం శిబిరాల వేదికగా అనేక అక్రమాలు వెలుగుచూస్తున్నాయి. దివ్యాంగ సర్టిఫికెట్ల పేరిట వసూళ్ల పర్వం సాగుతున్నదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కింది స్థాయిలో పని చేసే ఒప్పంద ఉద్యోగులు గ్రూపులుగా ఏర్పడి దివ్యాంగులను వేధిస్తున్నారు. డిజెబులిటీ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునే దివ్యాంగుల ఫోన్ నంబర్లు తీసుకొని, నేరుగా వారికి ఫోన్లు చేసి, సర్టిఫికెట్లు ఇప్పిస్తామని ఆశపెట్టి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇలానే ఈ నెల 10న గంగాధర మండలం గట్టుభూత్కూర్‌కు చెందిన దివ్యాంగుడు కొత్తూరి రాజయ్యకు వైకల్య సర్టిఫికెట్ ఇప్పిస్తానని ఆయన కూతురికి ఇదే దవాఖానలోని ఎంసీహెచ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న సాదిక్ ఫోన్ చేసి బురిడీ కొట్టించే ప్రయత్నం చేశాడు. ఈ విషయాన్ని హాస్పిటల్ సూపరింటెండెంట్ గుండా వీరారెడ్డికి దృష్టికి తీసుకెళ్లడం, వెంటనే ఆయన స్పందించి నేరుగా సదరం క్యాంపు వద్దకు వచ్చి సాధిక్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ బాగోతం మొత్తాన్ని 'నమస్తే తెలంగాణ' బట్టబయలు చేసింది. 'సదరం సర్టిఫికెట్‌కు రూ.30 వేలు' శీర్షికన ఈ నెల 11న ప్రముఖంగా ప్రచురించిన కథనం సంచలనం సృష్టించింది. దీంతో వైద్య యంత్రాంగం కదిలింది. ఆర్‌ఎంవో నవీన, ఏవో శ్రీమాన్నారాయణ, అనస్తీషియాలజిస్ట్ శంతన్‌కుమార్, ఫిజీషియన్ సృజన్ సభ్యులుగా సూపరింటెండెంట్ వీరారెడ్డి ఒక కమిటీని వేసి విచారణ చేపట్టారు. సెక్యూరిటీ గార్డ్ సాధిక్‌ను ప్రధానంగా విచారించిన కమిటీ సభ్యులు, ఆయన చెప్పిన అనేక విషయాలతో నిర్ఘాంత పోయారు. దవాఖానలో పనిచేస్తున్న పీఆర్‌వో వినయ్ తనకు ఫోన్ నంబర్ల జాబితా ఇచ్చి, దివ్యాంగులకు ఫోన్ చేయించినట్టు సాధిక్ తెలిపాడు. ఈ విషయాన్ని పీఆర్‌వో కూడా అంగీకరించాడు. దీంతో ఆ ఇద్దరిని ఉద్యోగాల నుంచి తొలగించినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. కాగా, దవాఖానలో పని చేస్తున్న పీఆర్‌వోలపైనే ప్రధానంగా ఆరోపణలు రావడంతో ఈ వ్యవస్థనే రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు.




'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం